క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



తాటిపర్తిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న అపర్ణా సేవా ట్రస్టు సభ్యులు

పిఠాపురం: సంక్రాంతిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీఅపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలకు దుప్పట్లు, చీరలు, పురుషులకు దుప్పట్లు, పంచెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీఅపర్ణా సేవా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా నిరుపేదలకు చేతనైనంత సాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. సంక్రాంతిని అందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అపర్ణా సేవా ట్రస్టు చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకరశాస్త్రి, బత్తుల వీరభద్రరావు, ఆకుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



ఊరేగింపులో ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు

కొత్తపల్లి: మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి, కనకదుర్గమ్మ ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి అయ్యప్పస్వామి రథంపై కేరళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం భక్తులకు జ్యోతి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో విస్తృతంగా సెబ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా దాడులు చేసి వంద లీటర్ల సారా, 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో మోటారు బైక్‌పై సారా తరలిస్తున్న బొందలపు రమణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి బైక్‌తో పాటు వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రీసు రాఘవపై కూడా కేసు నమోదు చేశారు. పెద్దిపాలెం సమీపంలో సారా స్థావరాలపై దాడులు చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. శంఖవరం మండలం శృంగధార గ్రామంలో గూడెం లక్ష్మిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 14 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్

గోకవరం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని రంపయర్రంపాలెంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో అడ్డతీగలకు చెంది నికిల్, వసంత్‌లు విజేతలుగా, ఇందుకూరుపేటకు చెందిన సాయి, వినయ్ రన్నరప్‌గా నిలిచారు. జూనియర్స్ విభాగంలో గణేష్, ఉమ విన్నర్స్‌గా, అర్జున్, చరణ్‌తేజ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు సంఘం అధ్యక్షుడు చిక్కం దొరబాబు, ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల రాజు, ఆర్థిక కార్యదర్శి నవనాసి చలపతిరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిక్కం సతీష్‌బాబు, కర్రి నూకరాజు, కాకర విష్ణు, పాటి అపపలరాజు, నందం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలోని మాండవ్యనారాయణస్వామి కల్యాణం



సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో గోదా కల్యాణం



సామర్లకోటలో ఆబోతుతో కోలసంబరం నిర్వహించిన కళాకారులు



కొత్తపల్లిలో భోగి మంట వద్ద చిన్నారుల సందడి

భోగిభాగ్యాలు కలగాలని కోరుతూ...

- కన్నులపండువగా భోగి పండగ
- మంటల్లో పిడకలు వేసిన చిన్నారులు
- గ్రామాల్లో పండగ సందడి



అచ్చంపేటలో పిడకల దండతో భోగి మంట వద్ద సందడి



కొత్తపల్లి మండలంలో భోగి మంట వద్ద జనం



గ్రామాల్లో హరిదాసు సంకీర్తనలు



మరిడమ్మ ఆలయంలో చిన్నారులకు భోగి పండ్లు వేసి ఆశీర్వచనం అందిస్తున్న వేద పండితులు

కొత్తపల్లి: నూతన సంవత్సరంలో భోగభాగ్యాలు కలగాలని కోరుతూ ఆదివారం మండల వ్యాప్తంగా భోగి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రజలు తెల్లవారుజామునే తలస్నానాలు చేసి తమ ఇళ్లు, రహదారుల ముఖ్యకూడళ్లలో కలప, దుంగలతో భోగి మంటలు వేశారు. వీటితో చిన్నారులు ఆవు పిడకలతో చేసిన దండలను వేశారు. చిన్నలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి మంటల వద్ద గుమిగూడారు. కాగా సాయంత్రం మూడేళ్ల లోపు చిన్నారులకు భోగిపళ్లు వేసి వేడుకలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులను పిలిచి బహుమతులు అందజేశారు. హరిదాసులు హరినామ సంకీర్తనలతో ఇంటింటా తిరిగారు. మహిళలు, చిన్నారులు హరిదాసులకు బియ్యం, పిండి వంటలు, దక్షిణాలను కానుకలుగా ఇచ్చారు. గంగిరెద్దుల వారు ఇంటింటికీ వెళ్లి సన్నాయి వాయిస్తూ, డోలు మోగిస్తూ గంగిరెద్దులతో చేయించిన విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఘనంగా భోగి పండగ

సామర్లకోట: భోగి పండగను ఆదివారం పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో, వార్డులలో తెల్లవారు జామునే భోగి మంటలను ఏర్పాటు చేశారు. పిల్లలను తల స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి ఆవు పేడతో తయారు చేసిన పిడకల దండలను భోగి మంటల్లో వేశారు. భోగి మంటల్లో వచ్చిన బూడిదను బొట్టు పెట్టుకున్నారు. చిన్నారులకు భోగి పండ్లు వేశారు. అచ్చంపేట గ్రామంలో 100 మీటర్ల భోగి పిడకల దండను తయారు చేసి భోగి మంట వద్దకు చిన్నారులు తీసుకు వచ్చారు. ఆ దండ స్థానికులను ఆకట్టుకుంది.

భక్తి శ్రద్ధలతో గోదా కల్యాణం

స్థానిక గోదావరి కాలువ తీరాన వేంచేసి ఉన్న మాండవ్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 16వ తేదీ నుంచి ఆలయంలో ధనుర్మాస పూజలు జరుగుతున్నాయి. ధనుర్మాస పూజలు ముగింపును పురస్కరించుకొని భోగి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కల్యాణం నిర్వహించారు. మాండవ్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ రెడ్నం దొరబాబు, 28వ వార్డు కౌన్సిలర్ రెడ్నం సునీత దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. ఆలయ పండితులు వేద మంత్రాలతో కల్యాణం చేశారు. పారిశ్రామికవేత్త బిక్కిన సాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘురామ్, రవికుమార్ స్వామి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. మండల పరిధిలో గొంచాల గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన నాయకులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం ఆదివారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో సాగింగింది. ధనుర్మాసం ముగింపును పురస్కరించుకొని ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠంసెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు, స్టేషన్ సెంటర్ మీదుగా రాత్రికి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. తమ తమ ఇళ్ల వద్దకు వచ్చిన స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సాహంగా కోల సంబరం

ఆదివారం పట్టణంలో కోల సంబరం ఉత్సాహంగా సాగింది. పట్టణంలో కోల సంబరం కళాకారులు ఉండటంతో ప్రతీ ఏడాది సంక్రాంతి మూడు రోజుల పాటు ఇంటింటా కోల సంబరం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా భోగి రోజు ఆదివారం కోల సంబరం నిర్వహించారు. భక్తులు ఇళ్ల నుంచి బియ్యం, డబ్బులు తీసుకొని వచ్చిన సమయంలో ఆబోతు వారికి తల ఊపుతూ అభివాదం తెలియజేసింది..

ఆనందోత్సాహాల మధ్య..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో భోగి పండగను ఆదివారం ఆయా ప్రాంతాల్లో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. పిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరూ వేకువ జామున లేచి అభ్యంగన స్నానమాచరించి కొత్త దుస్తులు ధరించారు. పిల్లలు గో పిడకలతో చేసిన దండలను భోగి మంటల్లో వేశారు. ఆయా ప్రధాన కూడలి వద్ద భారీ దుంగలతో యువకులు ఏర్పాటు చేసిన భోగి మంట వద్ద విబూదిని తీసుకుని నుదిటిన దిద్దుకుని ఇంటికి వచ్చి ప్రసాదం స్వీకరించి కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు.

మరిడమ్మ ఆలయంలో భోగి వేడుకలు

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్‌వి రామ్మోహనరావుల ఆధ్వర్యంలో సంప్రదాయ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే ఆలయం వద్ద భోగి మంటను వెలిగించి ఆలయంలో చిన్నారులకు భోగి పండ్లను వేయించి వేద పండితులతో చిన్నారులకు ఆశీర్వచనం అందించారు. ఆలయం ఆవరణలో రంగుల ముగ్గులతో అలంకరించి ప్రసాద వితరణ చేశారు.

సౌభాగ్యాల సంక్రాంతి

- భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు
- పెద్ద పండగకు సర్వం సిద్ధం
- అయ్యప్ప ఆలయాల్లో జ్యోతి దర్శనాలకు ఏర్పాట్లు



చిత్రాడలో గుండాట శిబిరాన్ని ధ్వంసం చేసిన క్రైం డీఎస్పీ రాంబాబు



పిఠాపురం మెయిన్‌రోడ్డులో పండగ సందడి



పిఠాపురం కుంతీమాధవస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: భోగభాగ్యాల కలిగించే భోగి పండగతో సంక్రాంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రతిఒక్కరూ తెల్లవారుజామునే తలస్నానాలు ఆచరించి తమ ఇళ్లు, రహదారుల ముఖ్యకూడళ్లలో దుంగలతో భోగి మంటలు వేశారు. ఆ మంటల్లో చిన్నారులు ఆవు పిడకల దండలను వేసి సందడి చేశారు.

మకర సంక్రాంతికి రెడీ

సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేసించే సమయమే మకర సంక్రాంతి. మూడు రోజుల పండగైన మకర సంక్రాంతి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించేందుకు గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామీణా ప్రాంతాలు కళకళాడుతున్నాయి. ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభం కావడంతో దేవాలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. మరోపక్క ఆదివారం భోగి పండగ నాడు పిఠాపురంలో వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి.

సంపదను ప్రసాదించే కనుమ

సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండగకు విశిష్ట స్థానం ఉంది. పశు సంపదను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా భావించి పూజించే పండగే కనుమ. కనుమ రోజున ధాన్యపు రాశులకు రైతులు పూజలు చేస్తారు. పశువులను శుభ్రంగా కడిగి పూలదండలతో అలంకరిస్తారు. ప్రత్యేక పూజలు సైతం చేస్తారు. కనుమ పండగ నాడు మినుములతో చేసిన వంటకాలకు ప్రాధాన్యం ఇస్తారు. కనుమనాడు కాకైనా కదలదన్న నానుడి ఉండడంతో ఆ రోజున ఎవ్వరూ ప్రయాణాలు చేయడానికి ఆసక్తి చూపరు. ఇంటి వద్దే ఉండి పిల్లలు, బంధువులతో సరదాగా కాలం గడుపుతారు.

కోడి పందేల జోరు

ఒకపక్క జూదాలు ఆడితే తాట తీస్తామంటూ హెచ్చరికలు చేసిన పోలీసులు దాడులు చేసి గుండాటను నిలువరించగా కోడి పందాలు మాత్రం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జూదాలు జోరుగా సాగాయి.

పోలీసుల దాడులు

వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గుండాట శిబిరాలపై క్రైం డీఎస్పీ ఎస్.రాంబాబు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గుండాట ఆడేవారిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాంప్రదాయబద్ధంగా కోడిపందేలు నిర్వహించుకుంటామని స్థానికులు కోరడంతో అనుమతి ఇచ్చారు.

నేటి నుంచి తిరునాళ్లు

- కావమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు
- మూడు రోజుల పాటు నిర్వహణ



ఆలయంలోని కావమ్మ, మారెయ్య

సామర్లకోట: స్థానిక రజకవీధిలో వేంచేసి ఉన్న కావమ్మ ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్లు జరుగుతాయి. స్థానిక బెస్తా కులానికి చెందిన సుకపట్ల లక్ష్మయ్య, వెంకయమ్మ దంపతులకు చెందిన కావమ్మ కాత్యాయిని వరంతో జన్మించిందని అంటారు. చిన్న వయస్సులోనే ఈశ్వర సంభూతుడైన మారయ్యను వివాహం చేసుకొంది. వివాహం అయిన ఆరు నెలల తరువాత మారయ్య మద్రాసులోని చిన్నాపట్నం దొర వద్ద బోయిలందరికి పెద్ద బోయిగా నెలకు ఆరు వరహాల జీతానికి చేరాడు. ఆరేళ్ల తరువాత తన భార్యను చూడాలనిపించి మద్రాసు దొరల వద్ద సెలువు తీసుకొని ఓడరేవుకు చేరుకున్నాడు. మారెయ్య వచ్చే సమయానికి ఓడ వెళ్లి పోవడంతో మరో మార్గం లేక పోవడం వలన కాలినడకన సామర్లకోటకు బయలుదేరాడు. కాకినాడ సమీపంలోనికి చేరే సమయానికి భరించలేని కడుపు నొప్పి రావడంతో సామర్లకోట చేరిన తరువాత మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కావమ్మ సతీసహగమనం చేయడానికి దొరల అనుమతి కొరింది. దొరల అంగీకారంతో స్థానిక రజకపేట సమీపంలో ఉన్న ఏలేరు కాలువ చెంతనే భర్త చితిపై కావమ్మ సతీసహగమనం చేసింది. మృతదేహం కాలిపోయిన కావమ్మ కాలి మెట్టెలు, తాళిబొట్టు కాలకుండా మిగిలి పోవడంతో కావమ్మ మహిమ కలిగినదిగా భావించి సతీసహగమనం చేసుకున్న ప్రదేశంలో కావమ్మ, మారెయ్యల విగ్రహాలతో ఆలయాన్ని నిర్మించారు. కావమ్మ ను స్నానం చేయించిన ప్రదేశంలో బావిని ఏర్పాటు చేశారు. నేటికి ఆ బావి నీటితో ఉంటుంది. సంక్రాంతి సందర్భంగా తిరునాళ్లు జరుగుతాయి. కావమ్మ తిరునాళ్లకు వచ్చిన గర్భిణులు పండ్లను నీటిలో వేయడం ద్వారా తేలితే మగ బిడ్డగాను, మునిగితే ఆడ బిడ్డగా భావిస్తారు. ప్రతీ ఏడాది మారెయ్య, కావమ్మ వారసులు సుకపట్ల ఆదినారాయణ, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయి. సోమవారం నుంచి జరిగే ఉత్సవాలను తిలకించడానికి భారీగా భక్తులు తరలి వస్తారు.

గ్రామాల్లో జోరుగా కోడి పందేలు



కొత్తపల్లి మండలంలో నిర్వహిస్తున్న కోడి పందేలు



మేడపాడు గ్రామంలో సాగిన కోడి పందేలు

కొత్తపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం కోడి పందేలు నిర్వహించారు. మండలంలో వాకతిప్ప, కొత్తపల్లి, నాగులాపల్లి, ఇసుకపల్లి, కోన పాపపేట, కొమరగిరి, కొండెవరం, గోర్స, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో పందేలు నిర్వహిస్తున్నారు. రాత్రులు సైతం నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా ఎవ్వరూ లెక్కచేయడం లేదు. ఆదివారం ఒక్క రోజే రూ.లక్షల్లో పందేలు జరిగినట్లు పలువురు చెబుతున్నారు.

కోస మాంసానికి గిరాకీ

సంక్రాంతిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో కోడి పందెలు నిర్వహిస్తున్నారు. పందేల్లో ఓడిపోయిన కోడి మాంసం (కోస మాంసానికి) డిమాండ్ పెరిగింది. కోస మాంసం రుచి చూసినవారు వాటి కోసం ఎగబడుతున్నారు. మూడు కిలోల కోసమాసం రూ.5 నుంచి రూ.6500 వరకు పలికింది. కాగా పందెంరాయుళ్లు అధికారులు, నాయకులు, అభిమానులు, బంధువులకు కోస మసాన్ని సంక్రాంతి కానుకగా పంపిస్తున్నారు.

జోరుగా కోడిపందేలు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో భోగి సందర్భంగా ఆదివారం కోడిపందేలు జోరుగా జరిగాయి. దివిలి, చంద్రమాంపల్లి, గుడివాడ, కట్టమూరు, ఆర్బీ కొత్తూరు గ్రామాలలోను, సామర్లకోట మండల పరిధిలో వేట్లపాలెం, జి.మేడపాడు, ఉండూరు,మాధవపట్నం, వీకే రాయపురం గ్రామాల్లో కోడి పందేలు సాగాయి. వాటిని తిలకించడానికి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గొల్లప్రోలులో కలిసిన పూర్వ విద్యార్థులు

పిఠాపురం: ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకుంటే వారు మాత్రం తమ పాత స్నేహితులను కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గొల్లప్రోలు ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 30 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెనుపోతుల శ్రీనివాస్, బసా మాణిక్యాలు, బసా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు



సామర్లకోట 6వ వార్డులో ముగ్గుల పోటీ



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన మోజెస్

సామర్లకోట: స్థానిక 6వ వార్డు శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాల వద్ద ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. భోగి పండగను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం వార్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో సుమారు 200 మంది పాల్గొన్నారు. ప్రతీ ముగ్గు ఒకదానితో ఒకటి పోటీ పడే విధంగా ఉండటంతో 10 మందిని ఎంపిక చేసి వారికి చీరలు బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ 10 ఏళ్లుగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ఇచ్చారు. వార్డు పెద్దలు తాతపూడి రాజు, చల్లాబత్తుల శ్రీను, జట్ల పెద్ద, దూది ఆదిబాబు పాల్గొన్నారు.

రామాలయానికి మైక్‌సెట్ బహూకరణ

కిర్లంపూడి: జగపతినగరంలోని కాపుల రామాలయానికి రూ.42 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను చదలవాడ బాబీ, మహాలక్ష్మి దంపతులు బహూకరించారు. ఈ మేరకు ఆదివారం రామాలయం ఆలయ కమిటీ సభ్యులకు మైక్‌సెట్‌ను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో దాతలను సత్కరించారు.